క్లుప్తంగా

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



కిట్లు అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, హెచ్ఎం

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా కానుక పేరిట సీఎం జగన్ ప్రోత్సాహన్ని కల్పిస్తున్నారని సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు అన్నారు. పీఎంసీ కమిటీ చైర్మన్ రంధి పుష్ప ఆధ్వర్యంలో గురువారం సూదివలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వారు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంతోపాటు గ్రామ పెద్ద రంధి రామునాయుడు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సన్నిబాబు, ఎంపీటీసీ నారాయణమ్మ

దేవరాపల్లి: పెదనందిపల్లిలోని బొడ్డు వారి కల్లాల నుంచి హైస్కూల్ రోడ్డు వరకు 600 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు రూ.31.50 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టే పనులకు సర్పంచ్ సోమిరెడ్డి సన్నిబాబు, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ గురువారం భూమి పూజ చేశారు. దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్డు సమస్యను పరిష్కరించిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వరాహ అవతారంలో జగన్నాథుడు



జగన్నాథ స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: జగన్నాథ రథయాత్రలో భాగంగా మూడో రోజు గురువారం జగన్నాథుడు వరాహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కేజేపురం, మాడుగుల, ఖండివరం, ఎం.కోడూరు, సత్యవరం, చింతలూరు, వీరనారాయణం, తదితర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఇంద్రద్యుమ్నం వద్ద లయ ప్రధాన అర్చకుడు పండా నూకరాజు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

గునుపూడిలో ఎంఈవో-2 తనిఖీ



వంట రుచి చూస్తున్న ఎంఈవో-2 వరహాలబాబు

నాతవరం: మధ్యాహ్న భోజనం పథకం మెనూ నిబంధనల లేకుంటే చర్యలు ఉంటాయని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు హెచ్చరించారు. గురువారం ఆయన గునుపూడి హైస్కూల్, ఎలిమెంటరీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా విద్యా హక్కు కిట్ల పంపిణీ రికార్డు పరిశీలించారు. తర్వాత భోజనం వంటకాల నాణ్యతను రుచి చూశారు. రోజూ ఇదే విధంగా మెనూ అమలు చేయాలన్నారు. హెచ్ఎం దేముడు పాల్గొన్నారు.

62 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు



గిరిజనులను పరీక్షిస్తున్న వైద్యాధికారి లలిత

దేవరాపల్లి: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామం వాలాబులో గురువారం 62 మంది రోగులను దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. లలిత పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో జ్వరంతో బాధపడుతున్న ముగ్గురి నుంచి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

రెండు పూటలా తరగతులు

- షిఫ్ట్ పద్ధతికి చెక్
- మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తొలగిన ఇబ్బందులు
- అధునాతన వసతులతో తాత్కాలిక భవనం
- త్వరలో రూ.13 కోట్లతో కొత్త భవనం



మాడుగులలో తాత్కాలికంగా కేటాయించిన డిగ్రీ కళాశాల

మాడుగుల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు పూటలా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు ఇక్కడ షిఫ్ట్ పద్ధతిలో తరగతుల నిర్వహణతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపేవారు కాదు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో ఇక్కడ వసతి సమస్య పరిష్కారమైంది.

స్థానిక జూనియర్ కళాశాలలో 17 ఏళ్లుగా షిఫ్ట్ పద్ధతిలో డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. 2008లోనే నూతన భవనానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో స్థలం కేటాయించక పోవడంతో భవనం నిర్మించలేదు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం చొరవతో పాండవులు కొండ సమీపంలో ఐదెకరాల స్థలం కేటాయించారు. రూ.13 కోట్లతో ఆధునిక హంగులతో భవన నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

అడ్మిషన్లు ప్రారంభం...

స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో బాలకల వసతి గృహానికి నిర్మించిన భవనాన్ని డిగ్రీ కళాశాలకు కేటాయించడంతో జూన్ 20వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభించారు. ఇంతవరకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఒక పూట తరగతులు మాత్రమే నిర్వహించేవారు. దాంతో దూర ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం అవి తొలగిపోవడంతోపాటు విద్యార్థులు చేరుతున్నారు. కళాశాలలో బి.ఎ, బి.కాం, కంప్యూటర్ బీఎస్సీ, బయాలజీ గ్రూపులు ఉన్నాయి. ఇక్కడ కంప్యూటర్, అర్థమెడిక్ రీజనింగ్, ఇంగ్లిష్ స్పీకింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

అన్ని వసతులతో డిగ్రీ కళాశాల



గతేడాది వరకు ఉదయం ఇంటర్మీడియట్, మధ్యాహ్నం డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహించడం వల్ల ఇబ్బందిగా ఉండేది. గ్రామీణ ప్రాంతాల నుంచి మాడుగుల డిగ్రీ కళాశాలకు వెళ్లి రావడానికి మధ్యాహ్న సమయంలో బస్సులు ఉండేవి కావు. తాత్కాలిక భవనంలోనూ కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించారు.

– వి.రమేష్, ఎం.కోడూరు. బి.ఎ. ఫైనల్ ఇయర్

మెరుగైన బోధన



గతేడాది వరకు జూనియర్ కళాశాలలో షిఫ్ట్ పద్ధతిలో డిగ్రీ తరగతుల నిర్వహణకు ఇబ్బందిగా ఉండేది. అరకొర బోధనతో విద్యార్థుల ప్రవేశాలపై ప్రభావం చూపేది. ప్రస్తుతం తాత్కాలిక భవనం సమకూరడంతో రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నాం. పూర్తిస్థాయిలో సిలబస్ పూర్తిపై దృష్టి సారిస్తాం. విద్యార్థులకు మెరుగైన బోధనతో మంచి ఫలితాలు రాబడతాం.

–సి.వి.ఎస్.ఎస్ శాస్త్రి, ప్రిన్సిపాల్ డిగ్రీ కళాశాల మాడుగుల

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



జెడ్.కొత్తపట్నంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కరణం ధర్మశ్రీ

రావికమతం: నియోజక వర్గంలో ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ముందున్న లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ధర్మవరం, జెడ్.కొత్తపట్నంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరుతోపాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని పైల అర్జియ్యనాయుడు, విద్యార్థినులు రమావతి, చినమ్మలు కోరారు. తనకు కొత్తకోట హాస్టల్‌లో సీటు ఇప్పించాలని విద్యార్థి నమ్మి దుర్గ కార్తీక్ కోరగా, అక్కడి నుంచే వార్డెన్‌కు ఫోన్ చేసి సీటు ఇప్పించారు. తమకు గతంలో ఇళ్లు మంజూరైనట్టు రికార్డుల్లో ఉందని, దాని వల్ల ఇప్పుడు మంజూరు కావడం లేదని కోట మణి, తొమ్మండ్రు లక్ష్మి, పెదపూడి అర్జున వాపోయారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, లేని పక్షంలో కొత్తకోటలో ఇళ్ల స్థలాలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సీసీరోడ్లను ఆక్రమణలు తొలగించి సీసీడ్రైనేజీ, కుళాయి పైపులైన్ వేయాలని జెడ్.కొత్తపట్నం ఎస్సీ కాలనీ వాసులు గొలగాన బైరాగి, అడిగర్ల చిరంజీవి, లాలం రాము విన్నవించారు. తన భర్త కూలీ పనులకు ఒడిశా వెళ్లి ప్రమాదంలో మృతి చెందాడని, ఎనిమిది నెలలుగా మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని గాలిరాజిబాబు భార్య, పిల్లలు వాపోయారు. జగనన్న సురక్షలో వచ్చేలా చూడాలని అధికారులను విప్ ధర్మశ్రీ ఆదేశించారు.

వరాల వెల్లువ..

కొత్తకోట, జెడ్.కొత్తపట్నం, గపవానిపాలెంతోపాటు మరో 20 గిరిజన గ్రామాలకు సంబంధించి రూ.95 లక్షలతో కాలువగట్టు తారురోడ్డు డిసెంబరులోగా నిర్మిస్తామని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ హామీ ఇచ్చారు. పాత, కొత్త ధర్మవరం గ్రామాల్లో అసంపూర్ణంగా ఉన్న అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి రూ.5 లక్షలు, మురగడ కాలువపై కల్వర్టుకు రూ.2.5 లక్షలు, జెడ్.కొత్తపట్నం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలు మరమ్మతులకు రూ.లక్ష, బోర్లు, సీసీడ్రైనేజీల నిర్మాణానికి మరో రూ.5 లక్షల చొప్పున మంజూరు చేశారు. త్రీ వీలర్ మోటార్ సైకిళ్లు ఇవ్వాలని దివ్యాంగులు గోగేటి స్వరూప రాణి, గొలగాన శివాజీ, లక్కోజు సాయి దుర్గ కోరగా త్వరలోనే అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ పైల రాజు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహాలక్ష్మినాయుడు, సర్పంచ్‌లు గుత్తం రాజ్యలక్ష్మి అప్పారావు, వితంశెట్టి లక్ష్మి సురేష్, మండల పరిషత్ ఎక్స్ అఫిషియో సభ్యుడు గాలి రమణబాబు, ఎంపీటీసీ చిన్ని చినమ్మలు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, వైస్ ఎంపీపీలు మత్స భవానీప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పోతనపూడిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సి.ఎం. బూడి ముత్యాలునాయుడు



పెంటయ్యపాలెం పాఠశాలలో నాడు - నేడు పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పోతనపూడి గ్రామ పంచాయతీ, శివారు పెంటయ్యపాలెంలో ఆయన గురువారం ఉదయం నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ లబ్ధిని వివరించారు. పోతనపూడిలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుతం తరగతి గదులను పరిశీలించారు. సురవరం కేజీబీవీలో సీటు ఇప్పించాలని పదో తరగతి పాసైన బోదా లావణ్య కోరారు. వెంటనే స్పందించి సీటు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. జలజీవన్ మిషన్ పథకం కింద రూ.93 లక్షలతో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. వీరవల్లి అగ్రహారం పెట్రోల్‌బంక్ నుంచి బంగారుమెట్ట వరకు రూ 1.93 లక్షలతో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. పోతనపూడిలో క్యాన్సర్ బాధితురాలు మైచర్ల మహలక్ష్మి అనే వృద్ధురాలికి రూ.1,500 అందించారు. పెంటయ్యపాలెంలో కమ్యూనిటీ హాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రెండు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం సీమంతాల కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. పెంటయ్యపాలెం ఎంపీయూపీ పాఠశాలలో రూ.20.06 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు, సర్పంచ్ కోరుకొండ భవానీ, సాంబమూర్తి, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, మండల సచివాలయాలు కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ దేవరాపల్లి మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, స్థానాయకులు కోరుకొండ సత్తిబాబు, ముచ్చకర్ల రాము, బంటు స్వామినాయుడు, మెలిపాక పైడినాయుడు, ఆర్లె పైడినాయుడు, కోరుకొండ శ్రీను, దండిపాటి శ్రీను, కోట్యాడ సాంబమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టినట్టు ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజు తెలిపారు. ఈ నెల 24వ తేదీలోపు బీఏ(పొలిటికల్ సైన్స్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ(ఫిజిక్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ(కెమిస్ట్రీ) మేజర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అప్పన్నదొరపాలెంలో 104 సేవలకు వినతి

మాకవరపాలెం: అప్పన్నదొనపాలెం పంచాయతీలో 104 సేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ రుత్తల సత్యానారాయణ డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ దృష్టికి తీసుకెళ్లారు. బూరుగుపాలెం పర్యటనకు గురువారం వచ్చిన డీఎంహెచ్‌వో దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఐదు కిలోమీటర్ల దూరంలో అప్పన్నదొరపాలెం ప్రజలు వైద్య సేవలు పొందేందుకు బూరుగుపాలెం రావాల్సి వస్తోందని వాపోయారు. దీనిపై డీఎంహెచ్‌వో స్పందించి 104 సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

26 నుంచి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే

మాడుగుల రూరల్: ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి సర్వే చేపట్టాలని వైద్యాధికారి ఎల్. శివప్రసాదుపాత్రుడు తెలిపారు. గురువారం కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు సర్వే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు రోజూ 20 నుంచి 30 ఇళ్లను సర్వే చేయాలన్నారు. ఎంపీహెచ్ఈవో రవికుమార్, హెచ్‌వీ పుష్పకాంతం, వెంకట్రావు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ త్రివేణి బదిలీ

రోలుగుంట: స్థానిక డిప్యూటీ తహసీల్దార్ హెచ్.త్రివేణి యలమంచిలి సి.ఎస్.డి.టిగా బదిలీ అయ్యారు. ఇటీవల ఈమె ఇక్కడ నుంచి బుచ్చియ్యపేట మండలానికి బదిలీ అయ్యారు. తర్వాత డిప్యుటేషన్‌పై మూడు రోజుల క్రితం రోలుగుంట వచ్చారు. తాజాగా ఉత్తర్వులతో ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు.

వైఎస్సార్ పశు బీమాతో ధీమా



మాట్లాడుతున్న పశువైద్యాధికారి ప్రియాంక

దేవరాపల్లి: పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా మామిడిపల్లిలో సర్పంచ్ కర్రి సూరినాయుడు, కలిగొట్లలో సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి అధ్యక్షతన వైఎస్సార్ పశు బీమా పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడిపల్లి పశు వైద్యాధికారి జి. ప్రియాంక మాట్లాడుతూ బీమా పాలసీ వర్తించాలంటే ఆవు లేదా గేదె ఒకసారైన ప్రసవించి ఉండాలన్నారు. మూడేళ్లగాను రూ.30 వేలు బీమాకు గాను రైతు మాత్రం రూ. 384 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గొర్రె, మేకకు బీమా చేసిన మొత్తం 6 వేలు కాగా రైతు మాత్రం ఏడాదికి రూ. 36 చెల్లించాలన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే 98 శాతం మంది అర్హులకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. పౌరుల సేవలను వెనువెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్నకు చెబుదాం (1902)ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏమి కావాలో సేకరించి, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి మిషన్ మోడ్‌లో సమస్యలకు పరిష్కారం చూపడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. నూటికి నూరు శాతం ప్రజలకు న్యాయం చేయాలన్నదే లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోని 91,585 కుటుంబాలను కలుపుకుంటూ 78 సచివాలయాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 1,442 మంది వలంటీర్లు, 2,884 మంది గృహసారథులు, 234 మంది సచివాలయ కన్వీనర్లు, గ్రామ, వార్డు సచివాలయ అధికారులు, మండలస్థాయి అధికారులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన నూరు శాతం మందికి ప్రభుత్వ పథకాలను చేర్చడం, అవసరమైన ధ్రువపత్రాలను అందిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్, రూరల్ అధ్యక్షుడు ఏకా శివ, సుర్ల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎంపీపీ మణికుమారి, జెడ్పిటీసీలు సుర్ల గిరిబాబు, అప్పలనర్స, సచివాలయ కన్వీనర్లు తమరాన శ్రీను, శానపతి వెంకటరత్నం పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

- కొత్తకోట కాలేజీ, హైస్కూల్ విద్యార్థులకు సీఐ అవగాహన



దేవరాపల్లిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు



విద్యార్థులకు క్రికెట్ కిట్ అందిస్తున్న సీఐ ఇలియాస్ మహమ్మద్

రావికమతం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వారి తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పించాలని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ అన్నారు. కొత్తకోట జూనియర్ కాలేజీ, హైస్కూల్ విద్యార్థులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. క్రికెట్ కిట్ ఉదారంగా అందించారు. చదువుతోపాటు ఆరోగ్యానికి క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు.

దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ..

దేవరాపల్లి: గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు అదనపు ఎస్ఐ మల్లిఖార్జున సూచించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కళాశాల వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. మాదక ద్రవ్యాలు, అక్రమ గంజాయి రవాణా తదితర అంశాలపై స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో(ఎస్ఈబీ) టోల్ ఫ్రీ నెంబర్‌కు 14500 ఫిర్యాదు చేయాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ పి.వి. అప్పారావు, మహిళా పోలీస్ కానిస్టేబుల్ పార్వతి, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు గొర్లె వరలక్ష్మి, ఎస్.కె. మీరాబి, శ్రావణి పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



చెర్లోపాలెంలో రీసర్వే చేస్తున్న అధికారులు

నాతవరం: భూరీసర్వేతో అపరిష్కృత భూ సమస్యలను పరిష్కరించేందుకు చక్కటి అవకాశమని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నరేంద్ర తెలిపారు. మండలంలో రెండో విడత కింద చెర్లోపాలెంలో గురువారం రీసర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెర్లోపాలెం రెవెన్యూ పరిధిలో రెండు వేల ఎకరాలకుపైగా భూములు ఉన్నాయన్నారు. రైతులంతా సహకరిస్తే సకాలంలో సర్వే పూర్తి చేస్తామన్నారు. రోజు ఒక్కంటికి 25 నుంచి 30 ఎకరాలు వరకు రీసర్వే చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు విజయకుమార్, జానకి, వీఆర్వో బాబు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు దొర్లితే చర్యలు

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

నర్సీపట్నం: ఓటరు జాబితాలో అనర్హులను గుర్తించి వెంటనే తొలగించాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై మున్సిపాలిటీ పరిధిలోని బీఎల్వోలకు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి 7వ తేదీ వరకు నిర్వహించినున్న ఇంటింటి సర్వే ద్వారా అనర్హుల ఓట్లు తొలగించాలన్నారు. ఎక్కడ ఎలాంటి తప్పులు దొర్లినా బీఎల్వోలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులతోపాటు, ఇతరుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటు తొలగింపు ప్రక్రియ

కె.కోటపాడు: ఓటు తొలగింపులో పారదర్శకంగా చర్యలు తీసుకోవడంతో ఎన్నికల సిబ్బందిని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత అభినందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌తో సమావేశాన్ని నిర్వహించారు. 2022–23 కాలంలో మరణించిన వారివి, వలసదారులవి, డబుల్ ఎంట్రీలు, తదితర కారణాలతో కె.కోటపాడు మండలంలో 2,246, దేవరాపల్లి మండలంలో 1,350 ఓట్లు తొలగించినట్లు ఆమె తెలిపారు. వీటిపై ఆయా కుటుంబాల వారికి సమాచారం అందించి తొలగించినట్లు ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు తెలిపారు. తహసీల్దార్ జె.రమేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి 'జగనన్న సురక్ష' సేవలు

రోలుగుంట: ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష సేవలందించి ప్రజలకు మేలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో ప్రభాకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మదిరంలో గురువారం అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా ప్రతి వలంటీర్‌ను తనకు కేటాయించిన ఇళ్లకు స్వయంగా వెళ్లి వారికి కావాల్సిన జన్మ, మరణ, కుల, మ్యూటేషన్, తదితర అవసరాలు తీర్చాలన్నారు.

నాతవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు 11 రకాల సేవలు పొందవచ్చునని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహ సారథులు, అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అంకిత భావంతో నిర్వర్తించాలన్నారు.

దేవరాపల్లి: అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారిని గుర్తించి వారి సమస్యలను పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ అన్నారు. సర్పంచ్ రొంగలి వెంకటరావు అధ్యక్షతన కొత్తపెంటలో ఎంఎల్‌వో పవన్‌కుమార్‌తో కలిసి సచివాలయ కన్వీనర్స్, వలంటీర్లు, గృహ సారథులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీయాలన్నారు. కొరుపోలు శ్రీను, రెడ్డి అప్పారావు, సిరికి శంకరరావు, కె.ఎస్. నాయుడు, ఆర్. అప్పారావు, కె. అప్పారావు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు



మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: జాలంపల్లిలో గొర్రెలు, మేకలకు గురువారం నట్టల నివారణ మందులు వేసినట్లు మాడుగుల పశువైద్యశాల ఏరియా సంయుక్త సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. 246 గొర్రెలకు, 430 మేకలకు నట్టలు నివారణ మందు తాపించగా, వైఎస్సార్ సంచార పశువైద్య సేవా వాహనం ద్వారా 12 గేదెలు, 8 ఆవులకు వైద్యం అందించామన్నారు. 38 పశువులకు, గొర్రెలకు, మేకలకు పేడ పరీక్షలు నిర్వహించారన్నారు. కె. వల్లాపురం పశువైద్యాధికారి పెట్ల నరేశ్, సంచార పశువైద్యాధికారి శైలేంద్ర, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

మాకిరెడ్డికి ఘన నివాళి

నర్సీపట్నం: కామ్రేడ్ వై.మాకిరెడ్డి సంస్మరణ సభలో వక్తలు ఆయన సేవలను కొనియాడారు. గురువారం గబ్బాడలో జరిగిన సంస్మరణ సభలో నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మాకిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్నో భూ పోరాటాలు జరుగు, బలహీన వర్గాల కోసం పని చేశారని జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సీనియర్ నాయకుడు రావు జగ్గారావు పేర్కొన్నారు.

పేద విద్యార్థులు ప్రయోజకులు కావాలి

బుచ్చెయ్యపేట: పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించి ప్రయోజకులను చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. గురువారం వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన పదిలో ప్రతిభ విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహకాలు అందించారు. ముఖ్యమంత్రి ఆశయాలు నెరవేరేలా ప్రతి విద్యార్థి పోటీతత్వంతో చదువుల్లో రాణించాలని వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు తెలిపారు. హెచ్ఎం శేషుబాబు, ఈవో లవరాజు పాల్గొన్నారు.